మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం



కమలాపురంలో కోర్టు ఆవరణలో మొక్కలు నాటి నీరు పోస్తున్న మెజిస్ట్రేట్ మధు సూధన్ రావు



పులివెందులలో హోమం నిర్వహిస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి, తదితరులు



జమ్మలమడుగులో మొక్కలు నాటుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

కమలాపురం : మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం అని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.మధుసూధన్‌రావు తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణలో ఆయన మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించాలని, పర్యావరణాన్ని రక్షించాలని ఆయన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. కమలాపురం నగర పంచాయతీ చైర్ పర్సన్ మార్పురి మేరి, కమిషనర్ జగన్నాథ్ ఆర్ఎస్ రోడ్డులో మొక్కలు నాటారు. కాలుష్య నివారణ కోసం పట్టణ ప్రజలు తప్పని సరిగా పర్యావరణ పరిరక్షణ పాటించాలన్నారు. పట్టణంలో 1000 మొక్కలు నాటాలని ప్రణాళికలు రూపొందించా మన్నారు. గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచ భూతాల వల్లే మానవ మనుగడ సక్రమంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణలో హోమాలు కీలకం

పులివెందుల టౌన్ : పర్యావరణ పరిరక్షణలో హోమాలు ఎంతో కీలకం వహిస్తాయని పర్యావరణ పరిరక్షణ సమితి కార్యదర్శి జి.రమణారెడ్డి తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుణ యాగం ద్వారా వర్షం వస్తుందనుకుంటామని, ఏ యాగం చేసిన వాతావరణం శుద్ధి జరిగి వర్షం వస్తుందన్నారు. కొన్నేళ్లుగా దేవాలయాల (నిర్మాణం) ప్రతిష్ట సందర్భంగా చేసే హోమాలలో ప్రకృతి విరుద్ధమైన పదార్థాలు వేయడం ద్వారా వర్షం రాకపోవడంతోపాటు ప్రకృతి వైపరీత్యాలు దెబ్బతింటున్నాయన్నారు. కొంతమంది హోమాలు చేసే ప్రాంతంలో కల్తీ ఆవు నెయ్యి, మూలికలు, గుడ్డ పీసులు, పండ్లు కలిపి మహిళలచేత హోమాలలో వేయిస్తున్నారని, ఇలా చేయడంవల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. దీనికి కారణంగా వడగళ్ళు, పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పట్టణంలోని స్థానిక ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ జయమ్మ అందజేశారు. అనంతరం కళాశాల ఆవరణలో నేరేడు మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న ఎంవీఐ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రాముడుతో కలిసి ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందించడం మనందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని వదిలేయకుండా నీరుపోసి పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఆర్డీఓ సాయిశ్రీ తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఆమె సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీటీలు నిజాముద్దీన్, రూపేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో మున్సిపల్ సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : అందరం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను బాధ్యతగా పెంచాలని తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా కుప్పం గ్రామంలో రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. అలాగే ఫారం పాండ్ల చుట్టూ కూడా మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటడంతోపాటు సంరక్షించే బాధ్యత ఖచ్చితంగా తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రంగారెడ్డి, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద మొక్కలను నాటాలని ఉపాధి హామీ ఏపీఓ పార్వతి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల వద్ద పంచాయతీ కార్యదర్శులు, వేంపల్లెలోని ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద ఏపీఓ పార్వతి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏఓ గంగిరెడ్డి, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పాలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో గురువారం మన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ ఈఓ కృష్ణానాయక్‌లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలతోనే మానవాళి మనగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఓబులమ్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



చక్రాయపేటలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్ విజయకుమారి,



వేంపల్లెలో మొక్కలు నాటుతున్న ఏపీఓ పార్వతి, తదితరులు



పాలతలలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి

క్లుప్తంగా

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

చింతకొమ్మదిన్నె : మండల శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 28వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు జరిగిన వేసవి విజ్ఞాన శిబిరాలు ముగిశాయి. ఈ వేసవి విజ్ఞాన శిబిరాలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ఆటల పోటీల కార్యక్రమాలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు స్థానిక సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్ ఖైరునిసా, పీరు ప్రసాద్‌లు పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఇబ్రహీం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గండి అన్నదానానికి రూ.20వేల వితరణ



ఆలయ చైర్మన్ కావలి కృష్ణ తేజకు నగదును అందజేస్తున్న దాత

చక్రాయపేట : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీగండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కుప్పాలపల్లె గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం తల్లి కాంతమ్మ, సోదరుడు రామచంద్రారెడ్డిలు రూ.20వేలు విరాళాన్ని ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి తీ ర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు చేయించా రు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ మురళి పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం

జమ్మలమడుగు : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని వైఎస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం ర్యాలీ సూపర్ సక్సెస్ కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం వచ్చిందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం మండలాలనుంచి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతాలనుంచి రైతులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా వెన్నుపోటు దినం ర్యాలీకి భారీగా తరలివచ్చి విజయవంతం చేసినందుకు కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రతిభా అవార్డు సాధించిన విద్యార్థిని



జి.లావణ్య

జమ్మలమడుగు : పట్టణంలోని సాయిపరమేశ్వర జూనియర్ కాలేజీ విద్యార్థిని జి.లావణ్య 2024–25 సంవత్సరానికి చెందిన ప్రతిభా అవార్డు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంటెంట్ పి. నాగేశ్వరరెడ్డి తెలినారు. గురువారం స్థానిక జూనియర్ కాలేజీలో ఆయన మాట్లాడుతూ జి.లావణ్య పదవ తరగతి పరీక్షల్లో 393 మార్కులు సాధించింది. ఇంటర్మీడియట్ తమకాలేజీలో చేరి 1000 మార్కులకు 933 మార్కులు సాధించిందన్నారు. గతంలో తమ కాలేజీకి నాలుగు సార్లు ప్రతిభా అవార్డు వచ్చిందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి చదువు



ఇంటిం ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

జమ్మలమడుగు : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు విలువలతో కూడిన చదువు నేర్పించడం జరుగుతుందని గూడెంచెరువు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. గురువారం గూడెంచెరువు గ్రామంలో ఇంటింటి వెళ్లి వారు కరపత్రాలు పంపిణీ చేశారు. తమ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సబ్జెక్టుల్లో మంచి ప్రావీణ్యం కలిగిన వారుంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, బూట్లు ఇస్తారన్నారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు

సిద్దవటం : మండల కేంద్రం పరిధి దిగువపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గురువారం సీతా, రామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రభాతసేవ, ప్రధాన కలశ షోడశోపచార పూజలు, యంత్రములకు, మూల విరాట్‌లకు పూజలు అనంతరం మూల విరాట్‌లను ట్రాక్టర్ ఉంచి సిద్దవటం దిగువపేట గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కాయా, కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చింతకొమ్మదిన్నె : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని తహసీల్దార్ ఏ.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు మామిళ్లపల్లె గ్రామ పరిధిలో బాల్య వివాహం చేపట్టే ప్రయత్నం చేసిన వారికి ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వం చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 అమల్లోకి తెచ్చిందన్నారు. తక్కువ వయస్సు కలిగిన వారికి వివాహం చేసే ప్రయత్నం చేస్తే ఫైన్ వేయడంతో పాటు శిక్ష పడుతుందన్నారు.

నేడు శ్రీరుక్మిణీ కల్యాణ మహోత్సవం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీకృష్ణ మందిరంలో శుక్రవారం సాయంత్రం శ్రీకృష్ణ రుక్మిణీదేవిల కల్యాణ మహోత్సవం శాస్త్రోయుక్తంగా నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ భక్త బృందం తెలిపారు. భక్తులు, మహిళలు పాల్గొని దేవదేవుని కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు భక్తులకు అల్పాహార వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

న్యాయం చేయాలంటూ నిరసన



గేటు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలంలోని అల్ట్రాటెక్(ఐసీఎల్) సిమెంట్ ఫ్యాక్టరీలో ప్యాకింగ్ ప్లాంట్ వద్ద పనులు చేస్తున్న కార్మికులు ఫ్యాక్టరీ గేటు వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో కొంతమంది ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు ప్యాకింగ్ పనులు చేపట్టమంటూ బయటికి వచ్చారు. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం డైలీ కార్మికులను పెట్టుకుని పనులు చేయించుకుంది. నెలరోజులు దాటినా యాజమాన్యం తమను గురించి పట్టించుకోకపోవడంతో గేటు వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని, గ్రామాల్లో క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు అధికమైపోతున్నాయని వారు వాపోయారు. సిమెంట్ పరిశ్రమకు ఉపయోగించే నాపరాయి మైనింగ్ నుంచి అధిక లోతు తీయడం వల్ల ఇళ్లకు నెర్రెలు చీలుతున్నాయన్నారు.

సబ్‌డివిజన్‌లోనే పోలీసుల చక్కర్లు

– బదిలీల్లో పైరవీల జోరు

ముద్దనూరు : అధికారంలో ఏ పార్టీ వున్నా దానికి అతీతంగా పోలీసుశాఖలో హోంగార్డు స్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోనే తిష్టవేసి విధుల్లో కొనసాగుతున్నారు. సాధారణ బదిలీల్లో కూడా హోంగార్డులు, కానిస్టేబుళ్ళు, హెడ్‌కానిస్టేబుళ్ళు, ఏఎస్‌ఐలు సబ్‌డివిజన్ పరిధిలోనే విధుల నిర్వహణకు అలవాటుపడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు పోలీసు సబ్ డివిజన్‌ల పరిధిలోనే అధిక శాతం మంది ఖాకీలు ఈ రకంగా చక్కర్లు కొడుతున్నట్లు, ఇందుకు అనుగుణంగా అధికారపార్టీ నాయకులనుంచి పైరవీ లేఖలతో ప్రయత్నాలు చేస్తున్నారు. జమ్మలమడుగు సబ్‌డివిజన్ పరిధిలో ఏళ్ళ తరబడి స్టేషన్లు మారుతూ, ఇతర ప్రాంతాలకు బదిలీకాకుండా పోలీసులు జాగ్రతపడుతున్నారు. సబ్‌డివిజన్ పరిధిలోనే పోలీసులు పాతుకుపోవడంతో పక్షపాతధోరణితో పాటు స్థానిక అధికార పార్టీ, ఇతర రాజకీయ నాయకులు, సమాజంలో పలుకుబడి వున్న వారికి విధేయంగా వుంటూ వారికి వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు తలెత్తుతున్నాయి. గతంలో ఓ పోలీసు ఉన్నతాధికారి సబ్‌డివిజన్ పరిధిలో కాకుండా మరో సబ్‌డివిజన్‌కు సిబ్బందిని బదిలీచేశారు. త్వరలోనే బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక సబ్‌డివిజన్ పరిధిలోనే కొనసాగేటందుకు మొగ్గుచూపేందుకు ఎక్కువ శాతం మంది సిబ్బంది ఇప్పటికే పైరవీలు షురూచేసినట్లు సమాచారం.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న జిల్లా హర్టికల్చర్ అధికారి సుభాషిణి

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా హర్టికల్చర్ అధికారి సుభాషిణి, ప్రకృతి వ్యవసాయ పీడీ ప్రవీణ్ కుమార్‌లు తెలిపారు. గురువారం మండలంలోని చెన్నంరాజుపల్లెలో రైతు గంగిరెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి పద్ధతిలో ఎరువులు, ఘన, ద్రవ జీవామృతాన్ని తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీపీఎం వసంతకుమారి, థీమాటిక్ లీడ్ సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

బూడిద రెన్యువల్ అవకతవకలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావు

జమ్మలమడుగు : ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు బూడిద రెన్యువల్‌లో అవకతవకలపై, వాహనాల రెన్యువల్స్ విషయంలో ప్ర త్యేక దృష్టి సారించామని ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావు తెలిపారు. గురు వారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంత రాయం కలగకుండా జరుగుతుందన్నా రు. ఉత్పత్తికి సంబంధించి బొగ్గు రవాణా కూడా సకాలంలో అందుతుందన్నారు. ప్రస్తుతం 85 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయన్నారు. 6 యూనిట్‌లు సకాలంలో సక్రమంగా పనిచేస్తున్నాయన్నారు.

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయండి



ప్రమాదాలు జరుగుతున్న కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారి

పులివెందుల రూరల్ : పట్టణంలోని సంత మార్కెట్‌కు వెళ్లే దారివద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం ద్విచక్ర వాహనం లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. కానీ వాహనం పూర్తిగా దెబ్బతింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రింగ్ రోడ్డు సమీపంలోని మార్కెట్ వెళ్లే రహదారి వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

బక్రీద్ పండగ సంతోషంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ మార్పురి మేరి



మాట్లాడుతున్న సీఐ నరసింహులు



మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

కమలాపురం : ఈనెల 7వ తేదీన జరగనున్న బక్రీద్ పండుగను హిందు–ముస్లిం సోదరులు కలసి మెలసి ఐకమత్యంగా, సంతోషంగా జరుపు కోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మార్పురి మేరి తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగను హిందు ముస్లింలు కలసి ఐకమత్యంగా జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా గోవధ నిషేధం అని, ఇది పార్లమెంటులోనే చట్టం చేశారని గుర్తు చేశారు. గోవధ చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ముస్లిం మత పెద్దలకు ఆమె సూచించారు. అలాగే ఎక్కడైనా ఏ సంఘటన జరిగిన ముందుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బక్రీద్ పండుగ రోజున నమాజ్ చదివే ఈద్గాల వద్ద తగిన పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించాలని, నీటి సౌకర్యం కల్పించాలని ఆమె మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఎస్ఐ విద్యాసాగర్, కమిషనర్ జగన్నాథ్ మాట్లాడుతూ గోవధ పూర్తిగా నిషేధం అన్నారు. ఆవులు, దూడలు, ఒంటెల మాంసాలు విక్రయించుట, సంహరించుట, తరలించుట చట్ట వ్యతిరేకం అన్నారు. అలాంటి చర్యలకు పాల్పిడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అన్ని మతాల మతపెద్దలు పాల్గొన్నారు.

వేంపల్లెలో

వేంపల్లె : బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని వేంపల్లి సీఐ నరసింహులు తెలిపారు. గురువారం స్థానిక పోలీసు కార్యాలయంలో వివిధ మతాల పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. బక్రీద్ పండుగను నిబంధనల మేరకు పోలీసులకు సహకరించాలన్నారు. వేంపల్లి మత సామరస్యానికి ప్రతీకగా కొనసాగుతుందన్నారు. ఏమైనా సమస్యలుంటే డయల్ 100కిగాని, స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును పటిష్టం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రంగారావు, తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది, మత పెద్దలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో

జమ్మలమడుగు : స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా డివిజన్ పరిధిలోని రెవెన్యూ, పోలీసు, పీస్ కమిటీలతో ఆర్డీఓ సయిశ్రీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ చట్టం ప్రకారం ఆవులు, దూడలతోపాటు ఒంటేలను హింసంచకూడదని సూచించారు. హిందువులు ఆవులను దైవంగా పూజించే సంప్రాదాయం ఉంది. కాబట్టి వాటిని జంతు వధకు ఉపయోగించకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరు చట్టం మేరకు మాత్రమే నడుచుకోవాలని సూచిచంచారు. అనంతరం ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, డిప్యూటీ పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ బ్రహ్మంలు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 12 మండలాలు ఉన్నాయి. రెండు మండలాలకు కలిపి ఎస్ఐ పశుసంవర్థకశాఖ అధికారి రెవెన్యూ అధికారులతో కమిటీ ఉంటుంది. ఎవరికైనా సందేహాలు ఉంటే ఈ కమిటీతో సంప్రాదించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గొర్రెలు, మేకలను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

పరామర్శ



సురేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ రవీంద్రనాథరెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక నగరిగుట్టలో నివాసముంటున్న ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్ కుటుంబాన్ని గురువారం రామతులశమ్మ ఆసుపత్రి ప్రముఖ చిన్నపిల్లల డాక్టర్ రవీంద్రనాథరెడ్డి పరామర్శించారు. ఇటీవల సురేష్ కుమార్తె చిన్నారి మౌనిక ఆకస్మిక మృతి చెందడంతోపాటు ఆమె నేత్రాలు దానం చేయడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ రవీంద్రనాథరెడ్డి సురేష్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపి ధైర్యంగా ఉండాలని, నేత్రదానం చేయడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక వైద్యశాల ల్యాబ్ టెక్నీషయన్ నరేష్, ఎస్ఏహెచ్ఎస్ అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖల్లో నిర్వహించే బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జంబారపు అహరోన్ తెలిపారు. ఆ మేరకు గురువారం స్థానిక వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిద్దయ్యకు వినతిపత్రం సమర్పించారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మొదటి వారంలోనే జీతాలను చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నెల ప్రారంభంలో ఇవ్వాల్సిన జీతాలు సకాలంలో చెల్లించక పోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారికి రావలసిన జీతాలను నెల మొదటి వారంలోనే చెల్లించాలని, రాయలసీమ ట్రేడ్ యూనియన్ నగర కార్యదర్శి మడగలం ప్రసాద్ కోరారు. గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు అందక ఇంటి బాడుగలు, కరెంటు బిల్లులు, పిల్లల స్కూలు, ఆటోల ఫీజులు, డ్వాక్రాలు చెల్లింపులు, వ్యక్తిగత ఈఎంఐలు తదితర చెల్లింపులలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. వీటి వలన అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వారికి రావలసిన డబ్బులను నెల మొదటి వారంలోనే చెల్లిస్తే! వారు చెల్లించవలసిన వారికి సకాలంలో చెల్లించే వెసులుబాటు ఉంటుందని తెలిపారు.

10 నుండి ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10 నుండి ఉద్యోగ పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో గురువారం ఉచిత శిక్షణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ హైకోర్టు, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆర్ఆర్‌బీ గ్రూప్‌డీ, ఎన్‌టీపీసీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీతో రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.